
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 10 । ఏప్రిల్ । 2023



తెలంగాణ నేతలంటే అలుసు

తెలంగాణ ప్రజాప్రతినిధులంటే బీజేపీకి అలుసుగా మారిందని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు విమర్శించారు. 10లో



నాలుగో వేవ్‌పై అప్రమత్తం

ఇటీవల కరోనా కేసులు పెరుగుతున్నందున ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. 8లో

గరిష్టం / కనిష్టం
40° / 22°

వాతావరణం

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు మరింతగా పెరుగుతాయి. రాత్రికి కూడా వేడి వాతావరణమే ఉంటుంది.



న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



పెద్దమ్మతల్లి ఆలయం వద్ద భక్తుల సందడి..

పాల్వంచరూరల్ : మండల పరిధిలో వేంచేసి ఉన్న శ్రీకనకదుర్గమ్మ(పెద్దమ్మతల్లి) అమ్మ వారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఒడిబియ్యం, చీరలు, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం, అర్చన నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, డైరెక్టర్లు భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అంబేడ్కర్ జయంతి వేడుకల కన్వీనర్‌గా బసవయ్య



బసవయ్య

సింగరేణి(కొత్తగూడెం): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు ఈనెల 14న సింగరేణి వ్యాప్తంగా నిర్వహించనున్నారు. సింగరేణి పరిధిలో వేడుకల నిర్వహణకు గాను ఆదివారం కమిటీని నియమించారు. కన్వీనర్‌గా జీఎం పర్సనల్(వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య, కో కన్వీనర్లుగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు ఆంతోటి నాగేశ్వరరావు, భూక్యా నాగేశ్వరరావును ఎంపిక చేశారు. కాగా, జయంతి నిర్వహణకు రూ.లక్ష నిధులు కేటాయించిన సింగరేణి సీఎండీ శ్రీధర్‌కు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా సీఆర్‌పీఎఫ్ శౌర్య దినోత్సవ్



నివాళులర్పిస్తున్న సీఆర్పీఎఫ్ కమాండెంట్

చర్ల: మండలంలోని కలివేరులో గల 151 బెటాలియన్ క్యాంప్ కార్యాలయంలో సీఆర్‌పీఎఫ్ శౌర్య దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. క్యాంప్‌లో ఏర్పాటు చేసిన స్మారక స్థూపం వద్ద కమాండెంట్ ప్రద్యున్ కుమార్ షహీద్ నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1965 ఏప్రిల్ 9న 2వ కార్ప్స్ సీఆర్పీఎఫ్‌కు చెందిన దళం గుజరాత్‌లో దాడి చేసిన పాకిస్తాన్ సైన్యాన్ని ఓడించి చరిత్ర సృష్టించిందని గుర్తు చేశారు. ఈ అసమానమైన ధైర్యం, పరాక్రమం, భద్రతా దళాల త్యాగాలకు గుర్తుగా ప్రతీ సంవత్సరం ఏప్రిల్ 9న శౌర్య దినోత్సవం జరుపుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో సెకెండ్ ఇన్ కమాండెంట్ అయోధ్యసింగ్, డిప్యూటీ కమాండర్ ప్రదీప్ సింగ్ షెకావత్ తదితరులు పాల్గొన్నారు.

టన్నెల్ నిర్మాణానికి ఏడాది

సత్తుపల్లిరూరల్: సీతారామ ప్రాజెక్టులో కీలకమైన టన్నెల్ నిర్మాణ పనులు మండలంలోని యాతాలకుంట వద్ద ప్రారంభమయ్యాయి. రూ.58 కోట్ల అంచనా వ్యయంతో 1.75 కిలోమీటర్ల పొడవు, 5.25 మీటర్ల చుట్టు కొలతతో ఈ టన్నెల్ నిర్మించనున్నారు. ప్యాకేజీ – 9లో మొత్తం 19.23 కిలోమీటర్ల మేర కాల్వ నిర్మించనుండగా, ఇందులో భాగంగా టన్నెల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కాగా, ప్రతీ 100 మీటర్లకు ఓ చోట బోర్ వేసి పరీక్షించగా, ఎక్కడా హార్డ్‌రాక్ లేకపోవడంతో టన్నెల్ నిర్మాణ పనులకు ఏడాది సమయం పడుతుందని భావిస్తున్నారు. ఈ పనులను ఆర్డీఓ సూర్యనారాయణ, ఇరిగేషన్ ఈఈ సురేష్, డీఈఈ చంద్రశేఖర్, ఏఈ నర్సింహారావు ఆదివారం పరిశీలించారు.

కరకట్టపై నిర్లక్ష్యమేల?



దంపింగ్ యార్డు వాహనాల రాకపోకలతో దెబ్బతింటున్న గోదావరి కరకట్ట ప్రాంతం



కరకట్టపై గత గురువారం గ్రామపంచాయితీ అధికారులు తవ్విన కందకం..

కందకం తవ్విన గ్రామపంచాయతీ ఉద్యోగులు

- పర్యవేక్షించే ఇరిగేషన్ అధికారుల సమ్మతి లేకుండానే నిర్ణయం
- మరోపక్క చెత్త డంపింగ్ వాహనాలతో కరకట్టకు ముప్పు
- వరదలొస్తే మళ్లీ ఇక్కట్లు తప్పవని పట్టణ వాసుల ఆందోళన

భద్రాచలం: వర్షాకాలం వచ్చిందంటే భద్రాచలానికి గోదావరి వరద ముప్పు పొంచి ఉంటుంది. ఈ వరదల నుంచి సుమారు 80 వేల మంది భద్రాచల వాసులను కాపాడేది కరకట్టే. గతేడాది గోదావరి బీభత్సం నుంచి కాపాడిన కరకట్టను మరింత పటిష్టపర్చాల్సిన అధికారులు.. దానిపైనే కందకాలు తవ్వడం ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. పర్యవేక్షించాల్సిన మరో శాఖ అధికారులు సైతం నిద్రావస్థలో ఉండడంతో పట్టణ ప్రజలకు ముంపు ముప్పు వాటిల్లే ప్రమాదం ఏర్పడనుంది.

ఇరిగేషన్ అధికారుల అనుమతి లేకుండానే..

1986లో వచ్చిన గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకుని 2000 సంవత్సరంలో భద్రాచలం పరిసర ప్రాంత ప్రజలను కాపాడేందుకు రూ.53 కోట్ల వ్యయంతో ఆరు కిలోమీటర్ల మేర కరకట్ట నిర్మించారు. నాటి నుంచి ప్రతి ఏడాది గోదావరి వరదల నుంచి ప్రజలను ఇదే కాపాడుతోంది. ఈ కరకట్ట భద్రతతో పాటు అవసరమైన మరమ్మతులను ఇరిగేషన్ అధికారులు పర్యవేక్షిస్తుంటారు. దీనిపై ఎలాంటి నిర్మాణాలు, ఇతర పనులు చేపట్టాలన్నా ఇరిగేషన్ అధికారుల అనుమతి తప్పనిసరి. అయితే గ్రామపంచాయతీ వారు మాత్రం ఎలాంటి అనుమతి లేకుండానే ఇష్టారాజ్యంగా జేసీబీతో కందకాలను తవ్వడం విమర్శలకు దారి తీసింది.

ప్రజాందోళనలు పట్టవా..?

గత ఏడాది భద్రాచలం, పరిసర ప్రాంత ప్రజలను గోదావరి వరదలు అతలాకుతలం చేశాయి. భద్రాచలం వద్ద అత్యధిక స్థాయిలో 71.3 అడుగుల నీటి మట్టం నమోదైంది. ఈ సమయంలో భద్రాచలం ప్రజలను కాపాడింది కరకట్ట మాత్రమే. అయితే స్లూయీజ్ లీకేజీల సమస్యతో పాటు కరకట్టకు చివరి భాగం నుంచి వచ్చిన వరద నీటితో పట్టణంలోని పలు కాలనీలను వరద రాత్రికి రాత్రే చుట్టుముట్టింది. కట్టుబట్టలతో నిరాశ్రయులయిన వారిని సీఎం కేసీఆర్ స్వయంగా పరామర్శించి రూ.1000 కోట్లతో నూతన మోడల్ కాలనీ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అయితే దీనికి అంగీకరించని కాలనీవాసులు కరకట్టను పటిష్టపర్చడంతో పాటు పొడవు పెంచాలని డిమాండ్ చేశారు. పలుమార్లు ప్రజాప్రతినిధుల ఎదుట సైతం నిరసన వ్యక్తం చేశారు. భద్రాచలం ప్రజలకు సంజీవనిలా మేలు చేస్తున్న కరకట్ట భద్రతను చేపట్టాల్సిన అధికారులే దానికి తూట్లు పొడిచేలా వ్యవహరించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి కరకట్ట భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిర్లక్ష్యపు తవ్వకాలు చేపట్టిన ఆయా శాఖల అధికారుల పనితీరును పరిశీలించాలని కోరుతున్నారు.

తప్పు మీద తప్పు..

ఇటీవల భద్రాచలంలో మృత్యువాత పడిన జంతు కళేబరాలను గొయ్యిలో పూడ్చకుండా కరకట్టపై ఉన్న డంపింగ్ యార్డులో పడేశారు. దీనిపై 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో గ్రామపంచాయతీ అధికారులు మేల్కొన్నారు. అయితే కరకట్టకు దిగువన లేదా, నిర్మానుష్య ప్రాంతంలో వాటిని పూడ్చాల్సిన అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారు. పట్టణంలోని సుభాష్‌నగర్, శాంతినగర్, డిగ్రీ కళాశాల ఏరియాతో పాటు పలు కాలనీలను గోదావరి వరదల నుంచి కాపాడే కరకట్టపై నిర్లక్ష్యంగా జేసీబీతో కందకం తవ్వించారు. ఇప్పటికే డంపింగ్ యార్డు పేరిట చెత్త వేయడం, నిరంతరం వాహనాల రవాణా, జేసీబీతో చెత్తా చెదారం తొలగించడం వంటి కార్యక్రమాలతో ఆ ప్రాంతంలో కరకట్ట చాలా వరకు దెబ్బతిన్నది. మళ్లీ అదే ప్రాంతంలో కందకం తవ్వడంతో కట్ట పటిష్టతకు బీటలు వారే ప్రమాదం నెలకొంది. కందకం చిన్నదే అయినా.. వరదల సమయంలో అది కలిగించే ప్రాణ, ఆస్తి నష్టాలు ఊహించలేమని పలువురు ఆందోళన చెందుతున్నారు. నిబంధనలకు పాతరేస్తూ, ప్రజల భద్రతను గాలికొదిలేస్తూ పంచాయతీ అధికారులు తప్పు మీద తప్పు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మా అనుమతి తీసుకోలేదు.

కరకట్టపై కందకం తవ్విన విషయం మా దృష్టికి రాలేదు. కందకం తవ్వడానికి గ్రామపంచాయతీ అధికారులు మా నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదు. దీనిపై వివరాలు సేకరిస్తా. కరకట్ట భద్రతకు ముప్పు వాటిల్లేలా ఎటువంటి పనులు చేపట్టినా వారు చట్ట ప్రకారం శిక్షార్హులే.

–రాంప్రసాద్, ఇరిగేషన్ ఈఈ, భద్రాచలం

చందాలు, దందాలు ఉండవ్





ఆత్మీయ సమ్మేళనం సభలో అభివాదం చేస్తున్న పొంగులేటి, జూపల్లి, కోరం కనకయ్య, విజయాబాయి (ఇన్‌సెట్) మాట్లాడుతున్న పొంగులేటి

- నా వాళ్లను ఇబ్బంది పెడితే ఊరుకోను
- అధికారులు చట్ట ప్రకారం పని చేయాలి
- కొత్తగూడెం ఆత్మీయ సభలో పొంగులేటి
- రాష్ట్రమంతా ఖమ్మం వైపే చూస్తోంది : మాజీ మంత్రి జూపల్లి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/ చుంచుపల్లి: ఇకపై భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో చందాలు, దందాలు ఉండవని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని జిల్లాలోని ఓ ఎమ్మెల్యే, వారి కుటుంబసభ్యులు చేస్తున్న అరాచకాలు ఇకపై సాగవన్నారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభిమానులు కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ఆదివారం రాత్రి నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రం పరిధిలో సర్వే నంబర్ 137లో నివసిస్తున్న పేదలను ఓ ఎమ్మెల్యే తండ్రి బెదిరిస్తున్నాడని, ఇళ్లు కూల్చేస్తానంటూ ఇబ్బందులు పెడుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని అన్నారు. ఇకపై ఎవరి బెదిరింపులకు భయపడమని, ఏ ఒక్క ఇల్లు కూల్చినా బాధితుల తరఫున పోరాడేందుకు తానే స్వయంగా రంగంలోకి దిగుతానని పొంగులేటి స్పష్టం చేశారు.

చట్టబద్ధంగా పని చేయండి..

అధికారం ఎవరి సొత్తూ కాదని, ఐదేళ్ల తర్వాత అధికార, ప్రతిపక్షాల్లో మార్పులు వస్తుంటాయని పొంగులేటి అన్నారు. అందుకే ప్రభుత్వ ఉద్యోగులు అధికార పార్టీకి కొమ్ముకాయకుండా చట్టం, నిబంధనల ప్రకారం పని చేయాలని పొంగులేటి సూచించారు. అలా కాకుండా పోలీస్, రెవెన్యూ ఉద్యోగులు అధికార పార్టీ తొత్తుల్లా వ్యవహరిస్తూ తమను ఇబ్బంది పెట్టాలని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ సభకు మరింత మంది ప్రజాప్రతినిధులు రావాల్సి ఉందని, కానీ ప్రభుత్వ ఒత్తిళ్ల వల్ల రాలేకపోయారని అన్నారు. అయితే సమయం వచ్చినప్పుడు ఏ గూటి పక్షులు ఆ గూటికే చేరుతాయని వ్యాఖ్యానించారు. తెలంగాణ వచ్చిన తర్వాత కేటీపీఎస్‌లో ఉద్యోగులకు పీఆర్సీలు లేవని, ఆర్టిజన్ ఉద్యోగులను పర్మనెంట్ చేయడం మరిచారని విమర్శించారు.

ఇక్కడి నుంచే మార్పు

ఉమ్మడి ఖమ్మం జిల్లా వైపు రాష్ట్రం మొత్తం చూస్తోందని, ఇక్కడి నుంచే మార్పునకు నాంది పడుతుందని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆత్మీయ సభలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పదికి పది సీట్లలో శ్రీనివాసరెడ్డి తరఫున అభ్యర్థులను గెలిపించి ఉద్యమకారులకు బహుమతిగా ఇవ్వాలని జిల్లా ప్రజలను కోరారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అణచివేతకు గురవుతున్న తరుణంలో పొంగులేటి గళం విప్పారని, అందుకే తాను అంతదూరం నుంచి కొత్తగూడెం వచ్చానని చెప్పారు. ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపుతున్న శ్రీనివాసరెడ్డిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు. ఉద్యమ సమయంలో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.1000 కోట్లు ఆఫర్ చేసినా తిరస్కరించి ఉద్యమంలో భాగమయ్యానని జూపల్లి తెలిపారు. అయితే తెలంగాణ వచ్చిన తర్వాత ఉద్యమకారులకు సరైన గౌరవం దక్కడం లేదన్నారు. పొంగులేటి వెంట నడుస్తున్న సర్పంచ్‌లకు బిల్లులు మంజూరు చేయకుండా ఇబ్బంది పెట్టడం సరికాదని అన్నారు.

పొంగులేటి వెంటే మా ప్రయాణం

పేదలకు అండగా నిలుస్తూ ముందుకు సాగుతున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంటే తమ ప్రయాణమని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య స్పష్టం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎమ్మెల్యేలు, ఎంపీలు పేరుకే ఉన్నారని, ఎలాంటి పదవి లేకున్నా పొంగులేటి ప్రజాసేవలో ముందుకెళ్తున్నారని చెప్పారు. ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, డీసీసీబీ డైరెక్టర్లు తుళ్లూరి బ్రహ్మయ్య, మేకల మల్లిబాబు, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబుతో పాటు నాయకులు విజయాబాయి, జారే ఆదినారాయణ, కోట రాంబాబు, బేబీ స్వర్ణకుమారి, ఊకంటి గోపాల్‌రావు, ఆళ్ల మురళి, తూము చౌదరి, నాగేంద్ర త్రివేదితో పాటు పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వేల సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

మిత్రులతో కలిసి మసీదులకు వెళ్లేవాడిని

ఇఫ్తార్ విందులో కలెక్టర్ అనుదీప్



ముస్లింలతో కలిసి ప్రార్థన చేస్తున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): చిన్నతనంలో మిత్రులతో కలిసి మసీదులకు వెళ్లేవాడినని, రంజాన్ పండుగ రోజు సేమ్యా, పాయసం ఇష్టంగా తినేవాడినని కలెక్టర్ అనుదీప్ గతస్మృతులను గుర్తు చేసుకున్నారు. కొత్తగూడెం రామాటాకీస్ ఏరియాలోని మసీదులో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రార్థనల అనంతరం మాట్లాడుతూ.. రంజాన్ సందర్భంగా ముస్లింలు కఠోరమైన ఉపవాసాలు పాటిస్తూ ఆకలి విలువ ఏంటో అనుభవ పూర్వకంగా తెలుసుకుంటారని, సమాజంలో పేదల పట్ల సానుభూతితో వ్యవహరించడం హర్షణీయమని అన్నారు. సృష్టికర్త ఒక్కడేనని, అందరూ అయన దాసులేనని, పరస్పరం సోదరభావంతో మెలగాలని ఆకాంక్షించారు. స్వచ్ఛందంగా జకాత్ చెల్లించడం ద్వారా పేదల అవసరాలు తీర్చడానికి ఉపయోగపడతాయని వివరించారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి సంజీవరావు, డీపీఆర్‌ఓ శీలం శ్రీనివాసరావు, బ్రదర్ సిరాజ్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి కలెక్టరేట్‌లో ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి అశోకచక్రవర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ వినతులను లిఖిత పూర్వకంగా అందజేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన





కల్యాణ వేడుకకు హాజరైన భక్తులు (ఇన్‌సెట్) నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

నిత్యకల్యాణంలో 166 జంటలు

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం చిత్రకూట మండపంలో స్వామివారిని కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. కాగా, స్వామివారి నిత్యకల్యాణంలో 166 జంటలు పాల్గొనడం విశేషం.

ఉద్యానంలో మేటి.. పామాయిల్

- ఇటీవల అకాల వర్షాలను తట్టుకుని నిలిచిన తోటలు
- రైతుల ఆర్థికాభివృద్ధితోపాటు ప్రకృతి విపత్తులతో బేఫికర్
- ప్రత్యామ్నాయ పంటల్లో భేష్ అంటున్న ఉద్యాన అధికారులు



పామాయిల్ సాగు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పామాయిల్ సాగు ఉద్యాన పంటల్లో మేటిగా నిలుస్తోంది. ఆదాయం తెచ్చిపెట్టడంతోపాటు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట దెబ్బతినకుండా రైతుకు భరోసాగా ఉంటోంది. ప్రకృతి విపత్తులతో మామిడి, బొప్పాయి, జీడిమామిడి తదితర పంటలు ధ్వంసమై రైతులు నష్టపోతున్నారు. గత నెలలో జిల్లాలో కురిసిన అకాల వర్షాలకు బొప్పాయి, జీడిమామిడి, మామిడి తదితర తోటలు దెబ్బతిన్నాయి. కానీ పామాయిల్ తోటలకు ఎలాంటి నష్టమూ జరగలేదు. అంతర పంటలు వేసుకునే వెసులుబాటు కూడా ఉండటం రైతుకు మరో కలిసొచ్చే అంశంగా పేర్కొనవచ్చు.

రైతులకు చైతన్య కార్యక్రమాలు..

మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలకు ప్రాధాన్యత నివ్వాలని, తద్వారా ఆర్థిక పరిపుష్టి సాధించాలని ఇప్పటికే వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు అవగాహనా కార్యక్రమాల ద్వారా రైతులను చైతన్యం చేస్తున్నారు. గత నెలలో కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలులకు ఉద్యాన శాఖ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు 33 శాతం నిబంధనను అమలు చేస్తూ జిల్లాలోని పలు మండలాల్లో 145 ఎకరాల్లో బొప్పాయి, మామిడి, జీడిమామిడి, టమాట, మిరప పంటలు ధ్వంసమయ్యాయని ప్రభుత్వానికి నివేదికలు అందించారు. ఉద్యాన పంటలలో భాగమైన పామాయిల్‌కు మాత్రం నష్టం వాటిల్లలేదు. దీంతో రైతాంగానికి ఆర్థిక భరోసాతో పాటు ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా కూడా స్వీయరక్షణలో తనకు తానే సాటి అని నిరూపించుకున్నట్లయింది. వాతావరణ సమతుల్యం లేని సందర్భాల్లో కూడా తట్టుకుని నిలబడే శక్తిసామర్థ్యాలు మిగతా ఉద్యాన పంటలతో పోలిస్తే పామాయిల్ పంటకు ఎక్కువనే చెప్పవచ్చు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు, ఈదురు గాలులకు ఒక్క ఎకరంలో కూడా పామాయిల్ పంటకు నష్టం జరగకపోవడమే ఇందుకు ఉదాహరణగా పేర్కొనవచ్చు. ప్రభుత్వం కూడా పామాయిల్ తోటల సాగు విస్తీర్ణం పెంచాలని సూచించడంతోపాటు రైతులకు సహాయ సహకారాలు అందిస్తోంది.

పామాయిల్‌తో చింతలేదు



ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా పామాయిల్ సాగుకు మిగతా ఉద్యాన పంటలతో పోలిస్తే ఎక్కువ బెంగ ఉండదు. మొక్కలు పెరిగే ప్రారంభ దశలో జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది. ఒకసారి మొక్క పెరిగితే ఇక ఇబ్బందులు ఉండవు. అధికారుల సూచనల మేరకు పామాయిల్ సాగు చేస్తున్నాం. లాభదాయకంగా ఉంది.

– చింతల హారిక, మహిళా రైతు, లక్ష్మీదేవిపల్లి

అన్ని విధాలా లాభం



ఉద్యాన పంటలలో పామాయిల్ రైతులకు అన్ని విధాల లాభదాయకంగా ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే గుణంతోపాటు రైతులకు అంతర పంటల ద్వారా రెండవ ఆదాయాన్ని కూడా పామాయిల్ సాగు వల్లసాధ్యమవుతుంది. రైతులు ఆ దిశగా మొగ్గు చూపేలా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– జినుగు మరియన్న, జిల్లా ఉద్యాన అధికారి

నవమి ఆదాయం రూ.2.10 కోట్లు

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో ఈ ఏడాది నిర్వహించిన శ్రీసీతారాముల కల్యాణం, పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకానికి వచ్చిన ఆదాయం లెక్క తేలింది. కల్యాణం సందర్భంగా దేవస్థానంలో నిర్వహించిన పలు రకాల సేవలకు సంబంధించిన టికెట్ల విక్రయం, విరాళాల రూపంలో రూ.2.10 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు ఆదివారం వెల్లడించారు. ఇందులో సెక్టార్ టికెట్ల ద్వారా రూ. 67.65 లక్షలు, ఉభయదాతల సేవల ద్వారా రూ. 51,37,100, పట్టాభిషేకం ఆదాయం రూ.10,64,500, ప్రసాదాల ద్వారా 60,60,050, ఆన్‌లైన్ సేవల ద్వారా రూ.20,02,012.. మొత్తం రూ.2,10,28,662 ఆదాయం వచ్చిందని ఈఓ రమాదేవి వివరించారు. కాగా, 2021లో కోవిడ్ కారణంగా ఆలయంలో అంతర్గతంగానే కల్యాణం నిర్వహించారు. అయితే అప్పటికే ఆన్‌లైన్‌లో టికెట్లు అందుబాటులో ఉంచడంతో వాటి ద్వారా రూ.2.34 కోట్ల ఆదాయం సమకూరింది. అంటే ఈ ఏడాది ఇంత ఘనంగా ఉత్సవాలు నిర్వహించినా.. 2021 కంటే తక్కువగానే ఆదాయం నమోదైంది.

ఆదివారం ఒకరోజే రూ.15.68 లక్షలు..

శ్రీ సీతారామచంద్ర స్వామివారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. దీంతో ఒకరోజే రూ. 15.68లక్షల ఆదాయం వచ్చింది. ప్రసాదం టికెట్ల ద్వారా రూ.2,56,675, అభిషేకం, నిత్య కల్యాణం, కళ్యాణ కట్నాల టికెట్ల ద్వారా రూ. 8,47,371, సత్రాలఅద్దె రూ.36,288, శాశ్వత పూజా టికెట్ల ద్వారా రూ.30వేలు, శాశ్వత నిత్యాన్నదాన విరాళాలు రూ.1,13,325, కేశ ఖండన టికెట్ల ద్వారా రూ.28,850, ప్రచారశాఖ ద్వారా రూ.7,640, లైసెన్స్‌ల ద్వారా రూ.30 వేలు, తలంబ్రాల ద్వారా రూ.89,940, స్పెషల్‌లడ్డూల అమ్మకంతో రూ. 1.11లక్షలు, పర్ణశాల ఆలయ టికెట్ కౌంటర్ ద్వారా రూ.17,505.. మొత్తం రూ.15,68,594 ఆదాయం చేకూరింది.

క్లుప్తంగా

సింగరేణి సీనియర్ పీఓకు డాక్టరేట్


ప్రవీణ్‌కుమార్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి కార్పొరేట్ కార్యాలయం సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్‌కు డాక్టరేట్ లభించింది. బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఆయన 'స్టడీ ఆన్ ఆర్గనైజేషనల్ కల్చరల్ ఎఫెక్టివ్‌నెస్ ఆఫ్ సెకండరీ స్కూల్' అంశంపై సమర్పించిన పరిశోధన పత్రానికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది.

బీఆర్‌ఎస్ 'ఆవిర్భావ' ఇన్‌చార్జ్‌గా ఎంపీ కవిత

భద్రాచలం: ఈ నెలాఖరులో జరిగే బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలకు భద్రాచలం నియోజకవర్గానికి మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవితను ఇన్‌చార్జిగా నియమించినట్లు ఆదివారం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో, భద్రాచలంలో ఎంపీ మాలోత్ కవిత ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించాలని తెలిపారు. నియోజకవర్గకేంద్రంతోపాటు అన్ని గ్రామాలు, వార్డుల్లో జెండా పండుగను జరపాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఇల్లెందు: పట్టణంలోని 15వ నంబర్ బస్తీలో పేకాట స్థావరంపై ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, రూ.20 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను స్టేషన్‌కు తరలించినట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు

అశ్వాపురం: మణుగూరు భారజల కర్మాగారం ఉద్యోగుల నివాస సముదాయమైన గౌతమీనగర్ కాలనీ ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందిపై అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఆదివారం ఎస్‌ఐ జితేందర్ వివరాలు వెల్లడించారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. గత నెల 31న మధ్యాహ్నం ఐదుగురు సెక్యూరిటీ సిబ్బంది గౌతమీనగర్ కాలనీకి చెందిన ఓ ప్రైవేటు ఉపాధ్యాయురాలు ఇంటికి వెళ్లారు. మీ ఇంటికి ఎవరో వస్తున్నారంటూ, తనిఖీలు చేయాలంటూ ఇంట్లోకి వెళ్లారు. ఆమెను అసభ్యకరమైన మాటలతో తిట్టి, అనుమతి లేకుండా ఇంట్లో వీడియా తీశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సెక్యూరిటీ ఇన్‌చార్జ్(ఏఎస్ఓ) రమణబాబు, సెక్యూరిటీ సిబ్బంది చారి, సుధాకర్, సురేష్, వెంకటేశ్వర్లుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గోవుల తరలింపుపై..

దమ్మపేట: అక్రమంగా గోవులను తరలిస్తున్న వ్యక్తులపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. గోవులను అక్రమంగా తరలిస్తున్న వ్యాన్‌ను మండల పరిధిలోని పట్వారిగూడెం గ్రామంలో పోలీసులు పట్టుకున్నారు. వ్యాన్‌లో 9 ఆవులు, ఒక లేగ దూడను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనకాపల్లి జిల్లా నుంచి తెలంగాణ రాష్ట్రంలోని జనగామకు తరలిస్తున్నారని ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు. గోవులకు గడ్డి, నీరు లేకుండా తరలిస్తున్నారని, దీంతో ముగ్గురు నిందితులు సేనాపతి శివ, మొల్లి మరినయ్య, పెంటకోట అప్పలనాయుడుపై కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

చోరీ కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: శాంతి నగర్ కాలనీలో చోరీ ఘటనపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కాలనీకి ఇర్పా సావిత్రి గత నెల 25న కరీంనగర్‌లో ఉంటున్న తన కుమారుడి వద్దకు వెళ్లింది. ఈ నెల 4న తిరిగి రాగా ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో పరిశీలించగా రూ.20 వేల విలువైన ఇన్వర్టర్ బ్యాటరీ, రూ.5 వేల విలువైన సౌండ్ సిస్టంను చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

దమ్మపేట: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని మందలపల్లి గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని కొత్తచీపురుగూడెం గ్రామానికి చెందిన చిదర బాలరాజు, నాగార్జున ద్విచక్రవాహనంపై మందలపల్లి నుంచి తమ గ్రామానికి వెళుతున్నారు. ఈ క్రమంలో మందలపల్లి శివారులో సుమారు రాత్రి 9.30 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. దీంతో గాయపడి రోడ్డుపై పడి ఉండగా, స్థానికులు గమనించి 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సత్తుపల్లి ఆస్పత్రికి తీసుకెళ్లారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సదరు వ్యక్తి వ్యక్తి ద్విచక్రవాహనంపై సత్తుపల్లి నుంచి బుగ్గపాడు వైపు వెళ్తుండగా రుద్రాక్షపల్లి వద్ద గేదెలు అడ్డొచ్చాయి. దీంతో ఆయన బండి అదుపు తప్పడంతో ఇస్లావత్ సీతారాములును ఢీకొని సమీపంలోని ఇంటి ప్రహరీని ఢీకొట్టగా తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,943

నాలుగో వేవ్‌పై అప్రమత్తం

- నేడు, రేపు ఆస్పత్రుల్లో మాక్ డ్రిల్ నిర్వహణ
- కరోనా నియంత్రణపై వైద్య, ఆరోగ్య శాఖ దృష్టి


కరోనాపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది(ఫైల్)

చుంచుపల్లి: ఇటీవల రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మళ్లీ కరోనా కేసులు పెరుగుతున్నాయి. దీంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. తాజాగా కరోనా ఫోర్త్ వేవ్ పట్ల ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. వారు సోమ, మంగళవారాల్లో రెండు రోజులపాటు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో మాక్ డ్రిల్ చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమం ద్వారా డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, ఆశలు, అంగన్‌వాడీ సిబ్బంది ఎంతమంది ఉన్నారనే వివరాలు సేకరిస్తారు. వార్డుల్లో పడకలు, ఆక్సిజన్ వసతి, ఐసీయూలు, టెస్టింగ్ కిట్ల నిల్వలు, మందులు, వైద్య పరికరాల తదితర వివరాలు నమోదు చేసుకుంటారు. కోవిడ్ నియంత్రణకు ఎక్కడైనా సమస్య ఉంటే గుర్తించి పరిష్కరిస్తారు. ఒకవేళ సదుపాయాలు లేకపోతే యుద్ధప్రాతిపదికన సమకూర్చుకుంటారు. కాగా దాదాపు 8 నెలల తర్వాత జిల్లాలో కరోనా ఛాయలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం అక్కడక్కడా ఒకటి, రెండు కేసులు వెలుగు చూస్తున్నాయి. పక్క జిల్లాలు ఖమ్మం, మహబూబాబాద్‌లలో కేసులు అధికంగానే నమోదవుతున్నాయి. దీంతో జిల్లా ప్రజలు కొంత ఆందోళన చెందుతున్నారు. దీంతో ప్రజలను అప్రమత్తం చేసేందుకు వైద్య, ఆరోగ్యశాఖ సన్నద్ధమవుతోంది.

వణికించిన ఫస్ట్, సెకండ్ వేవ్‌లు

2020, మార్చి 11న జిల్లాలో తొలిసారి కరోనా కేసు వెలుగులోకి వచ్చింది. ఇటలీ దేశం నుంచి జిల్లాకు వచ్చిన యువతి ద్వారా బయటపడింది. ఆ తర్వాత మార్చి 23న కొత్తగూడెం డీఎస్పీ ఇంట్లో వరసగా పాజిటివ్ కేసులతో కలకలం రేగింది. తొలివిడతలో వచ్చిన కరోనా జిల్లా ప్రజలపై తీవ్ర ప్రభావం చూపింది. మళ్లీ 2021లో ఫిబ్రవరి నుంచి కరోనా సెకండ్ వేవ్ రాగా, ఎక్కువ మరణాలు సంభవించాయి. డిసెంబర్ వరకు కరోనా ప్రభావం కొంత మేర తగ్గింది. అదే సమయంలో కరోనా టీకాను అందుబాటులోకి వచ్చింది. ఇక 2022 జనవరి నుంచి ఏప్రిల్ చివరి వరకు కరోనా థర్డ్ వేవ్ ప్రభావం కనిపించింది. స్వల్ప జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు మాత్రమే ఉండటంతో జనం అంతగా భయపడలేదు. గతేడాది ఆగస్టు వరకు జిల్లాలో ఒకటి, రెండు పాజిటివ్ కేసులు నమోదైనా ఆ తర్వాత వైరస్ ప్రభావం ఎక్కడా కనిపించలేదు. దాదాపు ఆరు నెలల వరకు జిల్లాలో ఒక్క పాజిటివ్ కేసు కూడా నమోదు కాకపోవడంతో అధికారులు కరోనా ఫ్రీ జిల్లాగా భావించారు. ఈ ఏడాది మార్చి చివరి నుంచి మళ్లీ కరోనా కేసులు తెరపైకి వస్తున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ తగిన ముందస్తు జాగ్రత్తలు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగానే జిల్లాలోని 29 పీహెచ్‌సీలు, ఐదు యూపీహెచ్‌సీలు, ఐదు సీహెచ్‌సీలు, రెండు ఏరియా ఆస్పత్రులతోపాటు మెడికల్ కళాశాల పరిధిలో సోమ, మంగళవారాల్లో రెండు రోజులపాటు ఫోర్త్ వేవ్ కరోనా నియంత్రణ ఏర్పాట్లపై మాక్ డ్రిల్ చేపట్టనున్నారు.

కరోనా పరీక్షలు చేస్తున్న సిబ్బంది (ఫైల్)


జిల్లాలో కరోనా పరీక్షల వివరాలు

మొత్తం పరీక్షలు :	13,73,644
పాజిటివ్ కేసులు :	54,671
కోవిడ్ మృతులు :	572
ఐసోలేషన్ బెడ్స్ :	510

వ్యాక్సినేషన్ వివరాలు

దోస్	లక్ష్యం	వ్యాక్సినేషన్	శాతం
మొదటి	7,94,206	8,50,871	107
రెండో	7,94,206	8,55,516	108
బూస్టర్	8,30,756	6,23,396	75

రెండు రోజులు మాక్ డ్రిల్



జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సోమ, మంగళవారాల్లో కోవిడ్ నియంత్రణ ఏర్పాట్లపై మాక్ డ్రిల్ నిర్వహిస్తాం. ఇటీవల మళ్లీ కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు చేపడతాం. కరోనాను ఎదుర్కొనేందుకు సిబ్బంది, మందులు, ఆక్సిజన్, బెడ్స్, టెస్టింగ్ కిట్లు, మందులు వంటివి అందుబాటులో ఉంచుతాం. కరోనా నియంత్రణకు వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బందిని అన్ని విధాలా సిద్ధం చేస్తాం.

–డాక్టర్ జేవీఎల్ శిరీష, డీఎంహెచ్ఓ

ఉపాధి కల్పనకు కృషి

రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు


మాట్లాడుతున్న ట్రస్టు చైర్మన్ శ్రీనివాసరావు

కొత్తగూడెంరూరల్ : కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలకు గూడు, విద్య, వైద్యం, ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామని జీఎస్సార్ ట్రస్టు చైర్మన్, రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు తెలిపారు. కొత్తగూడెం క్లబ్‌లో జీఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండో రోజు ఆదివారం నిర్వహించిన యువశక్తి, యంగ్ లీడర్స్ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా రెండు రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాపు యువతకు వ్యక్తిత్వ వికాసంతోపాటు నాయకత్వ లక్షణాలు నేర్పించేందుకు ఉపయోపడుతుందని పేర్కొన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపులు, జాబ్ మేళా వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గంపా నాగేశ్వరరావు, ఎర్రబెల్లి రజనీకాంత్, జోగారావు, అంజి తదితరులు పాల్గొన్నారు.

అల్లరి మూకల దాడులు గర్హనీయం


మాట్లాడుతున్న కెచ్చెల రంగయ్య, గుమ్మడి నర్సయ్య, చంద్ర అరుణ తదితరులు

ఇల్లెందు: అర్ధరాత్రి అకస్మాత్తుగా ఎల్లన్న ట్రస్ట్‌ను ఆక్రమించుకునేందుకు ప్రయత్నించిన ఎన్డీ నేత మధు దుశ్చర్యను తీవ్రంగా ఖండించాలని ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగయ్య, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, మాజీ జెడ్పీటీసీ చంద్ర అరుణ అన్నారు. ఆదివారం ఇల్లెందులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇల్లెందు ఏరియాలో ప్రజాపంథాను బలోపేతం చేసిన అగ్రనాయకుల్లో ఎల్లన్న ముఖ్యుడని, పాకాల కొత్తగూడెంలో 1996 జూన్ 23న లడాయిగడ్డ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడని చెప్పారు. ఆయన స్మారకంగా ఆనాటి ప్రజాపంథా నాయకత్వం ఎల్లన్న పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసిందని, ఆ తర్వాత కాలంలో ప్రజాపంథా న్యూడెమోక్రసీగా పేరు మార్చుకుందని తెలిపారు. అలాంటి ఎన్డీలో అతి, మితవాద, అవకాశవాద విధానాలు, ముఠాతత్వం, అరాచకత్వం పెచ్చురిల్లిందన్నారు. ఈ చర్యలకు వ్యతిరేకంగా 2022, ఫిబ్రవరి 22న మళ్లీ ప్రజాపంథా నిర్మాణం చేశామని తెలిపారు. ఎన్డీలో ఉన్న కాలంలోనే ఆఫీస్‌కు రాకుండా అడ్డుకున్నారని, ప్రజాపంథా ఏర్పాటు అనంతరం కార్యాలయం తాళాలు ఇవ్వకుండా ఇబ్బందులు సృష్టించారని తెలిపారు. ఈ క్రమంలో ఏడాది గడిచిన తర్వాత ట్రస్ట్ భవన్‌ను మరమ్మతులు చేస్తుండగా అర్ధరాత్రి గోడలు ధ్వంసం చేశారని ధ్వజమెత్తారు. సర్వ హక్కులు ఉన్న తమను ఆఫీస్‌లోకి రాకుండా అడ్డుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. దాడికి పాల్పడిన వారిని వదిలేసి గుమ్మడి నర్సయ్య మీద కేసులు నమోదు చేయటం దుర్మార్గమన్నారు. ప్రజాపంథా నాయకులు నాయిని రాజు, ఆజాద్, బుర్ర వెంకన్న, కెచ్చెల కల్పన, కాంపాటి పృథ్వీ, యాకుబ్‌షావలీ, ఈసం శంకర్, పూనెం కుమార్ పాల్గొన్నారు.

చర్చలే సమస్యలకు పరిష్కార మార్గం

ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి మధు


మాట్లాడుతున్న ఎన్డీ రాష్ట్ర నాయకుడు మధు

ఇల్లెందు: ఎన్డీ, ప్రజాపంథా మధ్య ఘర్షణకు దారితీసిన ఆఫీసు సమస్యలు చర్చల ద్వారానే పరిష్కరించుకోవాల్సి ఉంటుందని, అదే వైఖరి ఎన్డీ ప్రదర్శిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవునూరి మధు తెలిపారు. ఆదివారం ఇల్లెందులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్డీ నుంచి పోటు రంగారావు నాయకత్వంలో చీలిక తెచ్చారని, ఈ చీలికకు ఎన్డీ వ్యతిరేకమని పేర్కొన్నారు. చీలిక లేకుండా సమస్య పరిష్కరించుకుందామని, చీలిక అనివార్యమైతే ప్రజాసంఘాలనైనా చీలిక లేకుండా చేద్దామని, ఆఫీసు విషయం కూడా చర్చల ద్వారా పరిష్కరించుకుందామని అప్పుడే ఎన్డీ రాష్ట్ర నాయకత్వం తెలిపిందని గుర్తుచేశారు. కానీ ఇందుకు భిన్నంగా ప్రజాపంథా నాయకులు ఇల్లెందులో ఎల్లన్న ట్రస్టు పేరుతో ఉన్న భవనానికి మరమ్మతులు చేసుకుంటున్నారని తెలిపారు. పైఅంతస్తును తమకు కేటాయించాలని కోరితే తిరస్కరించారని, తమను రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తమ కార్యకర్తల శ్రమతో ఏర్పాటు చేసిన భవనం కావటంతో తాము ఆఫీసు ప్రారంభించుకుంటుండగా, వారు అడ్డుకున్నారని ఆరోపించారు. పైగా తాము దాడులకు పాల్పడినట్టు ప్రచారం చేయటం తగదని పేర్కొన్నారు. ఇప్పటికైనా చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకుందామని హితవు పలికారు. ప్రజాపంథా తప్పుడు పద్ధతులు అవలంభిస్తే ప్రజలు గుణపాఠం చెబుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీ నేతలు సురేందర్, టి. నాగేశ్వరరావు, పి. నర్సింహ్మారావు, టి. నర్సింహ్మారావు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారాలు


పురస్కారాలు అందజేస్తున్న నిర్వాహకులు

భద్రాచలంటౌన్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన 40 మంది ప్రముఖులకు ఓసీ సంఘర్షణ సమితి ఆధ్వర్యాన ఆదివారం ఉగాది పురస్కారాలు అందజేశారు. భద్రాచలంలోని రెడ్డి సత్రంలో సమితి జాతీయ అధ్యక్షుడు సదాశివారెడ్డి, గాదె మాధవరెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో అవార్డులను అందజేసి సన్మానించారు. సమితి పదో వార్షికోత్సవం సందర్భంగా ఈ అవార్డులు ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాకాల దుర్గాప్రసాద్, మంజునాథరెడ్డి, శ్రీదేవిరెడ్డి, శంకర్‌రెడ్డి, అజీమ్, నదీమ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డ్రోన్ బాంబు దాడులపై ఆదివాసీల ఆందోళన


ఆందోళన నిర్వహిస్తున్న ఆదివాసీలు, (ఇన్‌సెట్) ఆదివాసీలు చూపించిన డ్రోన్ బాంబు శకలాలు

అడవిలో బతికే తమపై దాడులు ఆపాలని ఆవేదన

చర్ల: బాంబులు వేసి దాడులు చేస్తుంటే తమ బతుకులు సాగేదెట్లా అంటూ ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 7న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పామేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో మావోయిస్టులను లక్ష్యంగా చేసుకొని పోలీసులు డ్రోన్‌లతో బాంబులు వేశారని పేర్కొంటూ మావోయిస్టు పార్టీ సౌత్ సబ్ జోనల్ బ్యూరో అధికార ప్రతినిధి సమత లేఖను విడుదల చేసిన విషయం విదితమే. దీంతో ఆదివారం ఛత్తీస్‌గఢ్ మీడియా పామేడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని బట్టిగూడ, కొరగట్ట, మీనగట్ట, జబ్బగట్ట గ్రామాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా జబ్బగట్ట ఆదివాసీలు మాట్లాడుతూ ఈ నెల 7న ఉదయం 6 గంటల ప్రాంతంలో గ్రామ సమీపంలో విప్ప పూలు ఏరుకునేందుకు వెళ్తుండగా డ్రోన్లతో బాంబుల వర్షం కురిసిందని తెలిపారు. 20కు పైగా బాంబులు పడ్డాయని, దీంతో సమీపంలోని గుహల్లోకి వెళ్లి ప్రాణాలను కాపాడుకున్నామని, కొందరికి గాయాలయ్యాయని వివరించారు. గుట్ట వైపు నుంచి మూడు హెలికాప్టర్లు చక్కర్లు కొట్టాయని, వాటి నుంచి కాల్పులు జరపగా, గ్రామం వైపు తూటాలు దూసుకొచ్చాయని పేర్కొన్నారు. అడవులనే నమ్ముకొని జీవనాన్ని సాగించే తమపై డ్రోన్లు, హెలికాప్టర్ల ద్వారా దాడులు చేయడం ఎంతవరకు సమంజసమో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించాలని కోరారు. బాంబుల శకలాలను చూపిస్తూ ఆదివాసీలు ఆందోళన నిర్వహించారు. తమపై జరుగుతున్న దాడులను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, స్వచ్ఛంద సంస్థలు, మానవ హక్కుల సంఘాల నాయకులు ఖండించాలని కోరారు.

కొత్త బట్టలు తీసుకెళ్తూ మృత్యుఒడిలోకి..

- రోడ్డు ప్రమాదంలో మామా అల్లుడు మృతి
- ఖమ్మం, సూర్యాపేట జిల్లాల వాసులుగా గుర్తింపు

మరిపెడ రూరల్: ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి రోడ్డు వెంట ఉన్న సూచిక బోర్డును ఢీకొట్టిన ఘటనలో మామ, అల్లుడు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బుర్హాన్‌పురం శివారు పల్లె ప్రకృతి వనం వద్ద 365జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. మరిపెడ ఎస్సై పవన్‌కుమార్ కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంకు చెందిన బానోత్ రమేష్(50), తన కుమార్తె భర్త అయిన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం జగ్నా గ్రామానికి చెందిన పవన్(30)తో కలిసి కొత్త బట్టలు కొనుగోలు చేయడానికి బైక్‌పై మరిపెడకు వచ్చారు. తిరిగి వెళ్లే క్రమంలో బుర్హాన్‌పురం శివారులో బైక్ అదుపు తప్పి సూచిక బోర్డును ఢీకొట్టింది. ఈ ఘటనలో రమేష్, పవన్‌కు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. బాధిత కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

అమ్మవారి దర్శనానికి వెళ్తుండగా..

- అదుపుతప్పి భక్తుల వాహనం బోల్తా
- 30 మందికి గాయాలు
- క్షతగాత్రులంతా ఏపీ వాసులే


బోల్తా పడ్డ వాహనం


ఘటనా స్థలంలో క్షతగాత్రులు

అశ్వారావుపేటరూరల్: అమ్మవారి దర్శనానికి వెళ్తున్న భక్తుల వాహనం బోల్తా పడి 30 మందికి గాయాలైన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం చిన్న నల్లకుంట గ్రామానికి చెందిన 40 మంది గిరిజనులు టాటా ఏస్ వాహనంలో ఏపీ, తెలంగాణ సరిహద్దులో ఉన్న శ్రీ గుబ్బల మంగమ్మ తల్లి ఆలయానికి వస్తున్నారు. ఈ క్రమంలో అశ్వారావుపేట మండలం నారాయణపురం పంచాయతీ జగన్నాథపురం మూలమలుపు వద్ద డ్రైవర్ నిర్లక్ష్యంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో 30 మంది గాయపడ్డారు. బాలరాజు, ముత్తమ్మ, అహల్య, వెంకటేశ్వర్లు, కమలకు తీవ్రగాయాలయ్యాయి. వీరితోపాటు నాలుగు నెలల పసికందు, నాగమణి, నవీన్, పుష్ప, రాజు, నాగమ్మ, రత్తమ్మ, పార్వతి, సునీత, రమణమ్మ, వాణి, వరమ్మ, నాగరాజు, సంధ్య, మాధవి తదితరులకు కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను చిట్టితల్లి సంస్థ అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి భద్రాచలం, కొత్తగూడెం ఆస్పత్రులకు తీసుకెళ్లారు. ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, బీఆర్‌ఎస్ నాయకులు క్షతగాత్రులను పరామర్శించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.రాజేశ్ కుమార్ తెలిపారు. కాగా డ్రైవర్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

జాతర ఊరేగింపులో అపశ్రుతి

కారేపల్లి: మండల కేంద్రంలోని శ్రీగురువమ్మతల్లి జాతర శనివారం మొదలుకాగా, ఆదివారం రాత్రి వరకు అంగరంగ వైభవంగా సాగింది. శనివారం రాత్రి శ్రీగురువమ్మతల్లి, సర్వారెడ్డి దేవతామూర్తుల కల్యాణోత్సవం అనంతరం ఉత్సవ విగ్రహాల ఊరేగింపునకు ఎడ్ల బండ్లను సిద్ధ చేశారు. ఈ వేడుకను తికించేందుకు వేలాదిగా భక్తులు హాజరుకాగా, ఎడ్లబండిపైకి ఉత్సవ విగ్రహాలను చేర్చే క్రమంలో బెదిరిన ఎడ్లు పరుగులు తీశాయి. దీంతో జనం కూడా పరుగులు తీస్తుండడంతో తోపులాట జరగగా పేరుపల్లికి చెందిన మేడ శ్రీనుతో పాటు మరో మహిళకు గాయాలైయ్యాయి. అప్రమత్తమైన ఆలయ కమిటీ సభ్యులు, యువకులు ఎడ్లను అదుపు చేయటంలో భక్తులు ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం మరో జత ఎడ్లను కట్టి ఊరేగింపు నిర్వహించారు. ఇదేసమయాన రెండు గ్రూపుల మధ్య గొడవ జరగగా పరస్పరం దాడులకు పాల్పడ్డారు.


పశువుల భయంతో పరుగు తీస్తున్న భక్తులు

అంతా నిద్రిస్తుండగా చోరీ

11 తులాల ఆభరణాలతో పాటు రూ.లక్ష నగదు మాయం

కొణిజర్ల: కొణిజర్లలోని ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. శనివారం అర్ధరాత్రి ఇంట్లో అందరూ గాఢనిద్రలో ఉన్న సమయాన చొరబడిన దొంగలు 11 తులాల బంగారు, వెండి ఆభరణాలతో పాటు రూ.లక్ష నగదు ఎత్తుకెళ్లారు. కొణిజర్ల ఎస్‌ఐ జె.శంకరరావు తెలిపిన వివరాల ప్రకారం.. కొణిజర్లకు చెందిన తుప్పతి వెంకన్న, హేమ దంపతులు శనివారం రాత్రి ఇంటి బయట నిద్రించగా, వీరి కుమారుడు, కోడలు నరేష్ – రేషిక ఇంట్లోని బెడ్‌రూమ్‌లో నిద్రించారు. తెల్లవారుజామున వెంకన్న భార్య లేచి ఇంట్లోకి వెళ్లగా బెడ్‌రూమ్ తలుపులతో పాటు బీరువా తలుపులు తీసి వస్తువులన్నీ చిందరవందరగా ఉండడంతో భర్త వెంకన్న, కుమారుడు నరేష్‌ను నిద్ర లేపింది. వారు పరిశీలించగా బీరువాలో దాచిన నగలు, నగదు లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు కొణిజర్ల పోలీసులు ఖమ్మం నుంచి క్లూస్‌టీమ్ సభ్యులను పిలిపించి విచారణ చేపట్టారు. ఇటీవలే ఇంట్లో శుభకార్యం జరగగా, తీసుకొచ్చిన 11 తులాల బంగారు, వెండి ఆభరణాలు, రూ.లక్షల చోరీ జరిగినట్లు బాధితులు చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శంకరరావు తెలిపారు. కాగా, పదిహేను రోజుల వ్యవధిలో నాలుగుచోట్ల దొంగతనాలు జరగడంతో గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు.

క్లుప్తంగా...

రాష్ట్రంలో రాచరిక పాలన

ప్రశ్నించే స్వేచ్ఛ ఎమ్మెల్యేలకే లేదు: ఈటల రాజేందర్



వనపర్తి: ఎందరో ఆత్మబలిదానాలతో ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రంలో రాజరిక పాలన సాగుతోందని బీజేపీ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విమర్శించారు. వనపర్తి జిల్లాకేంద్రంలో ఆదివారం నిర్వహించిన బీసీల ఆత్మగౌరవ సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. గతంలో తెలంగాణ ఫ్లోర్‌లీడర్‌గా అసెంబ్లీలో హక్కులు, అధికారాలు, ప్రజాధనం గురించి గద్దించి ప్రశ్నించే స్వేచ్ఛ ఉండేదన్నారు. కానీ ప్రస్తుత కేసీఆర్ పాలనలో మారుమూల గ్రామం నుంచి అసెంబ్లీ వరకు ప్రశ్నించే అవకాశం లేకుండా ఉక్కుపాదం మోపుతూ.. ప్రజాస్వామ్యం అనే పదాన్ని ఉచ్చరించకుండా చేస్తున్నారని విమర్శించారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో తాను గెలుపొందిన తర్వాత అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడేందుకు ప్రయత్నిస్తే.. సభ నుంచి బయటకు పంపించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో శాశ్వతంగా తామే అధికారంలో ఉంటామనే భ్రమలో బీఆర్ఎస్ నాయకులు అణచివేతకు పాల్పడటం తగదని ఈటల హెచ్చరించారు.

హక్కుల కోసం పోరాడిన జస్టిస్ చిన్నప్పరెడ్డి



మాడభూషి శ్రీధర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం(హైదరాబాద్): తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజాపక్ష న్యాయమూర్తి జస్టిస్ ఓ.చిన్నప్పరెడ్డి శత జయంతి సభ జరిగింది. ఈ సందర్భంగా చిన్నప్పరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రముఖులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం మాజీ జాతీయ కమిషనర్, ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ.. న్యాయవ్యవస్థలో పని చేస్తూ ప్రజల హక్కుల కోసం నిలిచిన గొప్ప వ్యక్తి చిన్నప్పరెడ్డి అని కొనియాడారు. ఆయన ఎక్కడ పని చేసినా శ్రామికుల గొంతుకగా నిలిచారని గుర్తు చేశారు.తన సుదీర్ఘ అనుభవంలో ఎన్నో చారిత్రక తీర్పులు ఇచ్చిన గొప్ప వ్యక్తి అని అన్నారు. ప్రొఫెసర్ తోట జ్యోతిరాణి, సీనియర్ అడ్వొకేట్ ఎస్.సైదారావు, సీనియర్ జర్నలిస్టు ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సందడి



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్టిక్కర్‌కు హారతులిస్తున్న మహిళలు

ఏపీ వ్యాప్తంగా 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం పండుగ వాతావరణంలో కొనసాగుతోంది. ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు, సమన్వయకర్తలు, కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు కలసికట్టుగా ఇంటింటికీ వెళ్తున్నారు. జగనన్న ప్రతినిధులుగా వచ్చిన వీరందరినీ.. తమ ఇంటికి బంధువులొచ్చినంత సంబరంగా ప్రజలు చిరునవ్వుతో ఆహ్వానిస్తున్నారు. 'ఎమ్మెల్యే వద్దకు ప్రజలు వెళ్లడం మామూలే.. అందుకు విరుద్ధంగా ప్రజల వద్దకే ఎమ్మెల్యే రావడం అంటే అది కేవలం ఒక్క జగనన్న వల్లే సాధ్యమైంది' అంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ పలు విధాలా తమను ఆదుకుంటున్నారని, ఇలా ఆదుకుంటుండటం కొంత మంది పెత్తందారులకు గిట్టడం లేదని అక్కచెల్లెమ్మలు నేతల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు.

36% 'వంట' చెరకే!

దేశంలో వంటకు గ్యాస్ వాడకం 62 శాతం

- గ్రామీణ ప్రాంతాల్లో 46.7 శాతం కట్టెలు, వరిపొట్టు, పంట అవశేషాలతోనే
- ఛత్తీస్‌గఢ్‌లో అత్యధికంగా గ్రామీణ ప్రాంతాల్లో 84.2 శాతం కట్టెలతోనే వంట
- ఉచితంగా వంట చెరకు లభించడం, గ్యాస్ ధరలు భగ్గుమనడం కారణాలు
- కేంద్ర పర్యావరణ గణాంకాలు 2023 నివేదికలో వెల్లడి



సాక్షి, అమరావతి: దేశంలో 62 శాతం మంది వంట కోసం ఎల్‌పీజీ (గ్యాస్)ని వినియోగిస్తుండగా 36 శాతం ప్రజలు మాత్రం వంట చెరకునే వాడుతున్నట్లు కేంద్ర పర్యావరణ గణాంకాల నివేదిక వెల్లడించింది. 33.8 శాతం మంది కట్టెలు, పొట్టు, పంట అవశేషాలపై ఆధారపడుతుండగా 2.2 శాతం మంది వంట కోసం పిడకలను వినియోగిస్తున్నారు. 1.3 శాతం మంది కిరోసిన్, గోబర్ గ్యాస్, ఎలక్ట్రికల్, బొగ్గుల పొయ్యిపై వంట చేస్తున్నారు. ఇక ఎల్‌పీజీ వినియోగంలో గ్రామాలకు, పట్టణ ప్రాంతాలకు మధ్య భారీ వ్యత్యాసం ఉంది. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో కట్టెలు, పొట్టు, పంట అవశేషాలు ఉచితంగా లభిస్తుండటంతోపాటు బూడిదను పంట పొలాలకు ఎరువుగా వాడుతున్నందున వీటివైపు మొగ్గు చూపుతున్నారు. ఇక భగ్గుమంటున్న గ్యాస్ ధరలు కూడా కారణమే. ఈమేరకు కేంద్ర పర్యావరణ నివేదిక 2023ని గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ విడుదల చేసింది.

- గ్రామీణ ప్రాంతాల్లో 49.4 శాతం మంది ఎల్‌పీజీ వాడుతుండగా 46.7 శాతం మంది కట్టెలు, పొట్టు, పంట అవశేషాలపై ఆధారపడుతున్నారు. మూడు శాతం మంది పిడకలు, 0.7 శాతం మంది గోబర్ గ్యాస్, కిరోసిన్, ఎలక్ట్రికల్, బొగ్గుల పొయ్యిలను వాడుతున్నారు.
- పట్టణ ప్రాంతాల్లో 89 శాతం మంది వంట కోసం ఎల్‌పీజీ వాడుతుండగా 6.5 శాతం మంది కట్టెలు, పొట్టు, పంట అవశేషాలను వినియోగిస్తున్నారు. 0.3 శాతం మంది పిడకలు, 2.5 శాతం గోబర్ గ్యాస్, ఎలక్ట్రికల్, కిరోసిన్, బొగ్గుల పొయ్యిలను వాడుతున్నారు.
- ఛత్తీస్‌గఢ్ గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికంగా 84.2 శాతం మంది వంట కోసం కట్టెలు, పొట్టు, పంట అవశేషాలపైనే ఆధారపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో 16.3 శాతం మంది కట్టెలు, పొట్టు, పంట అవశేషాలపై వంట చేస్తుండగా 81.7 శాతం మంది ఎల్‌పీజీ వినియోగిస్తున్నారు.

వందే భారత్ రైలులో ఏపీ సీఎస్ ప్రయాణం



తిరుపతి అర్బన్: వందే భారత్ రైలులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి ప్రయాణించారు. రెండు రోజుల జిల్లా పర్యటన నిమిత్తం తిరుపతి వచ్చిన ఆయన ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం తిరుపతి రైల్వేస్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ శనివారం సికింద్రాబాద్‌లో వందే భారత్ ట్రైన్ ప్రారంభించడం శుభపరిణామమని తెలిపారు. యాత్రికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం సీఎస్ జవహర్ రెడ్డి తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి వందే భారత్ రైలులో గుంటూరుకు వెళ్లారు. అక్కడ నుంచి విజయవాడకు వెళ్లనున్నారు. ఆయనకు టీటీడీ ఈవో ధర్మారెడ్డి, జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, టీటీడీ జేఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మయ్య, నగరపాలక కమిషనర్ హరిత, స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ వీడ్కోలు పలికారు.

పొదుపు మహిళల 'అర్బన్ మార్కెట్లు'

స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించుకునేలా స్టాళ్లు



గత నెలలో విశాఖపట్నంలో నిర్వహించిన అర్బన్ మార్కెట్‌లోని స్టాళ్లు

- శ్రీకాకుళం, విశాఖలో 'మెప్మా' పైలెట్ ప్రాజెక్టు విజయవంతం..
- ఏపీలోని అన్ని పట్టణాల్లో ఏర్పాటుకు సన్నద్ధం

సాక్షి, అమరావతి: పట్టణ మహిళల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తూ స్వయం సహాయక సంఘాల మహిళలు స్వయంగా తయారు చేసే ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేలా ఏపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ద్వారా పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 'అర్బన్ మార్కెట్ల'ను ఏర్పాటు చేయనుంది. పైలెట్ ప్రాజెక్టుగా శ్రీకాకుళం, విశాఖలో నెలకొల్పిన అర్బన్ మార్కెట్లు విజయవంతం కావడంతో రాష్ట్రంలోని 123 కార్పొరేషన్లు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో ఈ నెలలోనే వీటిని ఏర్పాటు చేయాలని మెప్మా నిర్ణయించింది. మెప్మా రెండేళ్ల క్రితం 7 నగరాల్లో ఏర్పాటు చేసిన 'జగనన్న మహిళా మార్టులు' విజయవంతం కావడం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్తగా అర్బన్ మార్కెట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సిటీ మిషన్ మేనేజర్లకు(సీఎంఎం)మెప్మా ఎండీ ఆదేశాలు జారీ చేశారు. దుకాణాల ఏర్పాటుకయ్యే ఖర్చును మెప్మా చెల్లించనుంది. వీటిల్లో పొదుపు మహిళలు తయారు చేసిన వివిధ ఉత్పత్తులను విక్రయించుకునేలా ఏర్పాట్లు చేస్తారు. వైఎస్సార్ చేయూత, ఆసరాతోపాటు సున్నావడ్డీ రుణాలు తీసుకున్న పొదుపు సంఘాల మహిళలకు స్వయం ఉపాధి కల్పించేలా అర్బన్ మార్కెట్లను అందుబాటులోకి తెస్తున్నారు.

అద్భుతమైన అవకాశం

ఇంట్లో మసాలాలు, కారప్పొడులు లాంటి 26 రకాల పొడులు తయారు చేస్తుంటా. గతంలో తెలిసినవారికి, బంధువులకు మాత్రమే విక్రయించగా రూ.2 వేలు కూడా వచ్చేవి కాదు. ఇటీవల విశాఖలో అర్బన్ మార్కెట్‌లో రెండు రోజులు స్టాల్ నిర్వహించగా రూ.17 వేల మేర వ్యాపారం జరిగింది. కొత్త వినియోగదారులు పరిచయం కావడంతో ఆన్‌లైన్‌లో కూడా ఆర్డర్లు వస్తున్నాయి. అర్బన్ మార్కెట్ ద్వారా అనూహ్యంగా వ్యాపారం పుంజుకోవడం చాలా ఆనందంగా ఉంది.

– జి.సత్యరాజ్యలక్ష్మి, విశాఖపట్నం ఎంటర్‌ప్రెన్యూర్

ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రాలు

ఏపీలోని ప్రభుత్వ కార్యాలయాల్లోని ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణకు ఏర్పాట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో పేరుకుపోతున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను (ఈ–వేస్ట్‌ను) పర్యావరణహితంగా తొలగించడంపై ఏపీ ప్రభుత్వం దృష్టిసారించింది. పాలనలో పారదర్శకత కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని సేవలను ఆన్‌లైన్ విధానంలో అందిస్తుండడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ–వేస్ట్ భారీగా పెరిగిపోతుండటాన్ని సర్కారు గుర్తించింది. ఏటా ప్రభుత్వ కార్యాలయాల నుంచి వెయ్యి టన్నుల ఈ–వేస్ట్ ఉత్పత్తి అవుతున్నట్లు ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. కంప్యూటర్లు, ట్యాబులు, మొబైల్ ఫోన్లు, రూటర్లు, స్విచ్‌లు, వైర్లు వంటి వాటి కాలపరిమితి తీరిపోయి పనిచేయనివాటిని సేకరించి రీసైక్లింగ్, డిస్పోజబుల్ చేసేవిధంగా ఒక వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఈ వేస్ట్ సేకరణకు నోడల్ ఏజెన్సీగా ఏపీ టెక్నాలజీస్ సర్వీసెస్ (ఏపీటీఎస్)ని నియమించింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల మేరకు ఈ–వ్యర్థాలను రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఈ–వ్యర్థాలను సేకరించి వాటిని తీసుకెళ్లి రీసైక్లింగ్, రీ–ఫర్‌బిషింగ్, డిస్పోజబుల్ చేసే బాధ్యతల్ని అప్పగించేందుకు ఏపీటీఎస్ టెండర్లు పిలిచింది. ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, కార్యాలయాలు, సంస్థల నుంచి ఈ–వేస్ట్ సేకరించే విధంగా కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు.

పూలే జయంతి ఉత్సవ కమిటీలో స్థానం



కంభం శివకృష్ణ

మధిర: రాష్ట్రప్రభుత్వం అధికారంగా నిర్వహించనున్న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవ కమిటీలో మండలంలోని మడుపల్లికి చెందిన కంభం శివకృష్ణకు స్థానం దక్కింది. ఈమేరకు ఆయన కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శివకృష్ణ మాట్లాడుతూ బీసీల ఆశాజ్యోతి పూలే జయంతిని ఈనెల 11న ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాసమస్యలపై ఎలుగెత్తిన నేత కానూరి



సభలో మాట్లాడుతున్న అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు నాగన్న

కొణిజర్ల: ప్రజా నాట్యమండలి సభ్యుడిగా ప్రజాసమస్యలపై ఎలుగెత్తి పోరాడిన విప్లవ నేత కానూరి వెంకటేశ్వరరావు అని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పరకాల నాగన్న వెల్లడించారు. మండలంలోని రామనరసయ్యనగర్‌లో కానూరి వెంకటేశ్వరరావు ఎనిమిదో వర్ధంతి సభ శనివారం రాత్రి నిర్వహించారు. ఈసందర్భంగా నాగన్న మాట్లాడుతూ పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై వ్యంగ్యాస్త్రాలు సంధిస్తూ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యకు గురువైన వెంకటేశ్వరరావు అమరుడని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో నియంతల పాలన సాగుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బానోత్ కిషన్‌తో పాటు పి.విప్లవ్‌కుమార్, లక్ష్మి, ఖాసీంఖాన్, బాషా, శ్రీకాంత్, మహేష్, కిషోర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసానికి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. పెద్దసంఖ్యలో వచ్చిన పర్యాటకులు డీర్ పార్కులోని దుప్పులతో పాటు డ్యామ్ పైనుంచి జలాశయాన్ని వీక్షించాక బోటు షికారు చేస్తూ సాయంత్రం వరకు గడిపారు. కాగా, కిన్నెరసానిలో ప్రవేశానికి టికెట్ల ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.21,925, బోటింగ్ ద్వారా టూరిజం శాఖకు రూ.17,160 ఆదాయం లభించింది.

జిల్లా వార్తలు

తెలంగాణ నేతలంటే బీజేపీకి అలుసు

- ప్రధాని కార్యక్రమంలో ప్రొటోకాల్ ఉల్లంఘన
- ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు



నేలకొండపల్లి: సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ నాగేశ్వరరావు, పక్కన ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి తదితరులు


నేలకొండపల్లి: తెలంగాణ ప్రజాప్రతినిధులంటే బీజేపీకి అలుసుగా మారిందని బీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు విమర్శించారు. నేలకొండపల్లిలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన పాలేరు నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం–దేవరపల్లి జాతీయ రహదారి పనులకు ప్రధాని మోదీ శనివారం పర్యటనలో శంకుస్థాపన చేయగా, ఆహ్వానపత్రికలో తన పేరు చేర్చలేదని పేర్కొన్నారు. తెలంగాణ బిడ్డలను చులకనగా చూస్తున్నారని ఇదే నిదర్శనమని తెలిపారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ సిట్టింగ్‌లకే సీట్లు ఇస్తామని సీఎం కేసీఆర్ చెప్పినందున పాలేరు సీటుపై చర్చ అవసరం లేదని చెప్పారు. పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ వంటి మంచి మనస్సు నేతకు అధికారం ఇస్తే ఎంత అభివృద్ధి జరిగిందో చూస్తున్న ప్రజలు మరోమారు గెలిపించాలని కోరారు. ఆత్మీయ సమ్మేళనాల జిల్లా ఇన్‌చార్జ్ సుభాష్‌రెడ్డి, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు కూరాకుల నాగభూషణం, రాయల శేషగిరిరావు, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల్ల వెంకటేశ్వరరావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మితో పాటు నాగుబండి శ్రీనివాసరావు, ఇంటూరి శేఖర్, శాంత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న బీజేపీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): దేశానికి రోల్ మోడల్‌గా అభివృద్ధిలో దూసుకెళ్తున్న తెలంగాణకు అండగా నిలవకుండా స్వార్థ రాజకీయ ప్రయోజనాలతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటోందని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు ఆరోపించారు. కొత్తగూడెంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడరతూ సింగరేణిలో రాష్ట్రం వాటా 51 శాతం ఉన్నప్పుడు ఎలా ప్రైవేటీకరిస్తామని మాట్లాడిన ప్రధాని నరేంద్రమోడీ.. అందుకు భిన్నంగా బొగ్గు గనుల వేలానికి సిద్ధం కావడం ఏమిటో చెప్పాలన్నారు. భద్రాచలం – కొవ్వూరు రైల్వేలైన్ సమస్య 40 ఏళ్లుగా నలుగుతున్నా కేంద్రం పట్టించుకోకపోవడంతో సింగరేణి చొరవతో తెలంగాణ సరిహద్దు వరకు లైన్ వేసుకోగలిగామని తెలిపారు. గత ఐదేళ్లలో రాష్ట్రం నుంచి రూ.3.52 లక్షల కోట్లు తీసుకున్న కేంద్రం కేవలం రూ.81వేల కోట్లు మాత్రమే తిరిగి ఇచ్చిందన్నారు. ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సింగరేణి ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ కాపు సీతాలక్ష్మితో పాటు దామోదర్, కె.ధర్మరాజు, బాదావత్ శాంతి, భూక్యా సోనా, లగడపాటి రమేష్, అన్వర్‌పాషా, నల్లమల వెంకటేశ్వరరావు, ఎం.ఏ.రజాక్, అనుదీప్ పాల్గొన్నారు.

అన్నింటి సమ్మిళితమే ఊరు కవిత్వం

మేడ్చల్ అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి



సంపుటిని ఆవిష్కరిస్తున్న నర్సింహారెడ్డి, సాహితీవేత్తలు

ఖమ్మంగాంధీచౌక్: రంగు, రుచి, వాసన, స్పర్శల సమ్మిళితమే ఊరు కవిత్వమని ప్రముఖ కవి, అనువాదకులు, మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. ప్రముఖ కవి బీవీవీ.ప్రసాద్ రాసిన 'ఊరికే జీవితమై' కవితా సంపుటిని ఆదివారం రాత్రి ఖమ్మంలో ఆవిష్కరించారు. జాషువా వేదిక అధ్యక్షుడు మువ్వా శ్రీనివాస్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నర్సింహారెడ్డి మాట్లాడుతూ మట్టి వాసనలతో వెలువడిన అనేక కవితా సంపుటాలు తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయన్నారు. నిత్యం మానవ జీవన వేదనను తాత్వికంగా వాఖ్యానించడమే ప్రసాద్ ప్రత్యేకత అని తెలిపారు. కవి, అనువాదకులు ముక్కమాల చక్రధర్ మాట్లాడుతూ తెలియడంలో నుండి తెలియకపోవడంలోకి దూకాలంటూ ప్రసాద్ ఇచ్చిన ప్రేరణ ఎందరికో ఆదర్శమని చెప్పారు. అనంతరం ఇటీవల ఉగాది మహానంది జాతీయ పురస్కారాలు అందుకున్న కోమాకుల సీతారాములు, పంజాల ఐలయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు నామాడి శ్రీధర్, కట్టా శ్రీనివాస్, కొల్లు వెంకటేశ్వర్లు, అట్లూరి వెంకటరమణ, పగడిపల్లి వెంకటేశ్వర్లు, వురిమళ్ల సునంద, మేడగాని శేషగిరి, కన్నెగంటి వెంకటయ్య, ఎం.వీ.రమణ తదితరులు పాల్గొన్నారు.

లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆజాద్

ఖమ్మంమయూరిసెంటర్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ డిమాండ్ చేశారు. ఈనెల 18న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'నిరుద్యోగుల గోస – అఖిలపక్ష భరోసా' నిరసన దీక్షకు తరలిరావాలని కోరుతూ పీవైఎల్, పీడీఎస్‌యూ నాయకులు ఆదివారం ఖమ్మంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆజాద్ మాట్లాడుతూ ప్రశ్నాపత్రాల లీకేజీని నిలువరించేందుకు చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై అఖిలపక్షం ఆధ్వర్యాన రాష్ట్రపతి, గవర్నర్‌కు లేఖ రాయనున్నామని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, చందు, కరుణ్, సాయి, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ జట్ల ఎంపిక పూర్తి



సబ్ జూనియర్, జూనియర్ బాలికల జట్లు



సబ్ జూనియర్, జూనియర్ బాలుర జట్లు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన చేపట్టిన జూనియర్, సబ్ జూనియర్ బాలబాలికల జట్లను ఎంపిక పోటీలు ఆదివారం ముగిశాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీలకు జిల్లావ్యాప్తంగా జూనియర్ విభాగంలో 30 మంది బాలబాలికలు, సబ్‌జూనియర్ విభాగంలో 24 మంది బాలబాలికలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిన వారిని జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్లు నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎన్.ఫణికుమార్, ఉపాధ్యక్షులు దీప్తి తెలిపారు. పోటీలను అఖిల్ కుమార్, మణిప్రీతి, కౌశిక్, ప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

సింగరేణి ఆస్పత్రి ఆధునికీకరణకు రూ.10 కోట్లు

త్వరలోనే 30మంది స్పెషలిస్ట్ వైద్యుల నియామకం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి కార్పొరేట్ ఆస్పత్రి ఆధునికీకరణతో పాటు అత్యాధునిక పరికరాల కొనుగోలుకు రూ.10కోట్లు కేటాయించినట్లు సింగరేణి డైరెక్టర్(పా) ఎన్.బలరామ్ వెల్లడించారు. ఆస్పత్రిని ఈనెల 8న తాను తనిఖీ చేశానని తెలిపారు. ఈమేరకు సింగరేణి వ్యాప్తంగా కార్మికులు, వారి కుటుంబ సభ్యులు చికిత్స కోసం వచ్చే ఆస్పత్రిలో మరిన్ని ఆధునిక పరికరాలు కావాలని గుర్తించినట్లు చెప్పారు. దీంతో టూడీ ఎకో, తదితర పరీక్షల నిర్వహణకు పరికరాలు సమకూర్చనున్నామని తెలిపారు. అంతేకాక త్వరలోనే 30మంది స్పెషలిస్ట్ వైద్యులను నియమించనుండడంతో కార్మికులను రిఫర్ చేసే పని ఉండదని చెప్పారు. అలాగే, రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కమిషనర్, వైద్య సంచాలకులతో చర్చించి కార్మికులకు నాణ్యమైన మందులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ వివరించారు. కాగా, ఆస్పత్రి ఆధునికీకరణ పనులు పూర్తయ్యాక నామమాత్రపు ఫీజుతో పరిసర ప్రాంతాల ప్రజలకు కూడా వైద్యం అందించే ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉన్నందున కార్మికులు ఇబ్బంది పడకుండా గనుల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని ఆయన వెల్లడించారు.

ఆయిల్‌పామ్ సాగును పరిశీలించిన పాలమూరు రైతులు

అశ్వారావపేటరూరల్: మండలంలోని నారంవారిగూడెం, అచ్యుతాపురం, అల్లిగూడెంల్లో రైతులు సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటలతో పాటు అశ్వారావుపేట సమీపాన పామాయిల్ ఫ్యాక్టరీని మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల రైతులు ఆదివారం పరిశీలించారు. అలాగే, నారంవారిగూడెం వద్ద ఆయిల్‌పామ్ నర్సరీని కూడా సందర్శించగా, మొక్కల పెంపకం, ఎరువుల వాడకం, ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, గెలల క్రషింగ్ వివరాలను ఆయిల్‌ఫెడ్ అధికారులు వివరించారు. అనంతరం దమ్మపేట మండలంలోని అప్పారావుపేటలోని ఫ్యాక్టరీని కూడా పరిశీలించిన వారు మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. ఈ కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, డివిజనల్ మేనేజర్ ఆకుల బాలకృష్ణ, ఫ్యాక్టరీ మేనేజర్ కల్యాణ్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

చింతకాని: ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అవలంబిస్తూ చిరుధాన్యాల సాగుపై రైతులు మొగ్గుచూపాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి కోరారు. మండలంలోని కోమట్లగూడెంలో ఆదివారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎరువులు, పురుగు మందులు అధికంగా వినియోగిస్తున్నందున ప్రజల ఆరోగ్యం, పర్యావరణానికి నష్టం కలుగుతోందని తెలిపారు. ఈక్రమంలో కేంద్రప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం, చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తోందని చెప్పారు. గోఆధారిత వ్యవసాయం ద్వారా వ్యవసాయ ఉత్పత్తులను సమాజానికి అందిస్తే ఆరోగ్యకరమైన భారతావనిని నిర్మించవచ్చని తెలిపారు. బీజేపీ మధిర అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావుతో పాటు ఆలస్యం వీరప్రసాద్, పంది కృష్ణయ్య, కోట సికిందర్, కొండా గోపి, వెంకన్న, పులి పాటి ప్రవీణ్, శివ, విజయ్, ప్రణీత్ రెడ్డి, సాంబశివరావు, రమేష్, రాము పాల్గొన్నారు.